



EVENING EDITION

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

4PM
www.suryaa.com
శుక్రవారం
27-02-2026
పేజీలు: 02



## ఫీజుల దందాపై చెక్.. స్కూల్స్‌కు ప్రభుత్వ సీరియస్ వార్నింగ్

Revanth Reddy ప్రైవేట్ స్కూల్స్‌పై కఠిన వైఖరి అవలంబిస్తూ అధిక ఫీజులు వసూలు చేస్తున్న విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల ఆందోళనల నేపథ్యంలో విద్యాశాఖపై సమీక్ష నిర్వహించిన ఆయన, నిబంధనలు అతిక్రమించి ఫీజులు వసూలు చేస్తే అనుమతులు రద్దు చేయడమే కాకుండా, అదనంగా వసూలు చేసిన మొత్తాన్ని తిరిగి చెల్లింపజేస్తామని హెచ్చరించారు.రాష్ట్ర సమగ్ర విద్యా విధానంపై అధ్యయనం చేసిన Telangana Education Commission సమర్పించిన నివేదికను ముఖ్యమంత్రి పరిశీలించారు. 305 పాఠశాలలు, 46 సమావేశాల విశ్లేషణ ఆధారంగా రూపొందిన ఈ నివేదికలో 'తెలంగాణ పబ్లిక్ స్కూల్' మోడల్‌ను సిఫార్సు చేసినట్లు కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి తెలిపారు. ఫీజుల నియంత్రణ అంశంపై ప్రజల అభిప్రాయాలను సేకరించేందుకు ఆ వివరాలను వెబ్‌సైట్‌లో ఉంచాలని సీఎం సూచించారు.అదే సమయంలో ప్రభుత్వ పాఠశాలల మౌలిక సదుపాయాల మెరుగుదలపై కూడా దృష్టి సారించారు. కోర్ అర్బన్ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలలను Bharatiya Vidya Bhavan, Jubilee Hills Public School స్థాయికి తీసుకెళ్లాలని, ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణంలో రాజీ పడొద్దని స్పష్టం చేశారు.








## వదిన వచ్చేసింది ..

ఫిబ్రవరి 26న టాలీవుడ్ స్టార్ విజయ్ దేవరకొండ, నేషనల్ క్రష్ రష్మిక మందన్నా వివాహ బంధంలోకి అడుగుపెట్టిన సంగతి తెలిసిందే. రాజస్థాన్‌లో జరిగిన ఈ వేడుకకు కుటుంబ సభ్యులు, సన్నిహితులు మాత్రమే హాజరయ్యారు. ఇప్పటికే వీరి పెళ్లి ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతూ అభిమానులను ఆనందంలో ముంచెత్తుతున్నాయి. పలువురు సినీ ప్రముఖులు, రాజకీయ నాయకులు, ఫ్యాన్స్ ఈ జంటకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. ఇలాంటి ఆనంద వాతావరణంలో విజయ్ తమ్ముడు ఆనంద్ దేవరకొండ చేసిన ఓ స్పెషల్ పోస్ట్ ఇప్పుడు నెట్టింట హాట్ టాపిక్‌గా మారింది. రష్మిక, విజయ్‌తో కలిసి దిగిన ఒక అందమైన ఫోటోను షేర్ చేస్తూ ఆయన "వదిన" అంటూ హృదయపూర్వక సందేశం రాశారు.





## క్రికెటర్ రింకూ సింగ్ తండ్రి కన్నుమూత

భారత క్రికెటర్ రింకూ సింగ్ తండ్రి ఖంచంద్ర సింగ్ శుక్రవారం తెల్లవారుజామున కన్ను మూశారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధ పడుతున్న ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. ఖంచంద్ర సింగ్ కొంతకాలంగా స్టేజ్-4 లివర్ క్యాన్సర్‌తో బాధ పడుతున్నారు. గ్రేటర్ నోయిడాలోని యథార్థ్ ఆస్పత్రికి తరలించారు. కొన్ని రోజులుగా వెంటిలేటర్‌పై చికిత్స అందించారు. శుక్రవారం ఉదయం మృతి చెందారు. తండ్రి మరణవార్త తెలుసుకున్న రింకూ సింగ్ హుటాహుటిన ఉత్తరప్రదేశ్‌లోని అలీగఢ్‌కు బయలుదేరారు.



## ఇది ప్రభుత్వం కాదు.. రియల్ ఎస్టేట్ కంపెనీ

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

రాష్ట్రంలో ఉన్నది ప్రభుత్వం కాదని, రియల్ ఎస్టేట్ కంపెనీ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రాష్ట్రంలో పలు చోట్ల జరుగుతున్న ఇండ్ల కూల్చివేలతపై కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందిస్తూ తీవ్ర ఆరోపణలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి వెయ్యి కోట్లు గాంధీ కుటుంబానికి పంపుతానని మాట ఇచ్చాడని, అందుకే పేదల ఇళ్లు కూల్చి, భూములు అమ్మి డబ్బులు రెడీ చెయ్యాలని చూస్తున్నాడని ఆరోపించారు. పేదల ఇళ్లు కూలగొడుతూ హైదరాబాద్‌లో తన రెండవ పాలస్ కట్టుకుంటున్నాడని వ్యాఖ్యానించారు. పేదల ఇళ్లు పెకిలించి వేస్తూ మరో పక్క తన కోటకు గోడలు కట్టడానికే తొమ్మిది కోట్లు ఖర్చు చేస్తున్నాడన్నారు. సీఎంతో పాటు మంత్రులపైనా కేటీఆర్ ఫైర్ అయ్యారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మూడో ఇల్లు కట్టుకుంటున్నాడని, పొంగులేటి పదో కంపెనీ పెట్టి కమీషన్లు వెనకేసుకుంటున్నాడని ఆరోపించారు. ఇలా వీళ్లు మాత్రం ఎదుగుతూ పేదల జీవితాలను మాత్రం రోడ్డున పడేశారన్నారు. ఇది ప్రభుత్వం కాదని, రియల్ ఎస్టేట్ కంపెనీ అని, వీళ్లు మంత్రులు కాదని రియల్ ఎస్టేట్ బ్రోకర్లు అంటూ కేటీఆర్ ఘాటు విమర్శలు చేశారు.

## మార్చి నుంచి కొత్త చార్జీలు..

# ఆర్టీసీ ప్రయాణం ఇక చవక




తెలంగాణ ప్రజలకు వేసవి ప్రారంభంలో Telangana State Road Transport Corporation శుభవార్త అందించింది. బస్సు టికెట్ ధరల్లో గణనీయమైన తగ్గింపు చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ కొత్త ఛార్జీలు మార్చి 1 నుంచి అమల్లోకి రానున్నాయి.ఈ సడలింపు ముఖ్యంగా హైదరాబాద్ నగర పరిధిలో నడిచే ఏసీ సర్వీసులకు మాత్రమే వర్తించనుంది. ఎండలు తీవ్రంగా మారుతున్న నేపథ్యంలో ప్రయాణికులు సాధారణ బస్సులకంటే ఏసీ బస్సులనే ఎక్కువగా ఎంచుకుంటున్నారు. అయితే అధిక టికెట్ ధరల కారణంగా కొందరు వెనకడుగు వేస్తుండటంతో, ప్రస్తుతం ఏసీ బస్సుల్లో సగటు ఆక్యుపెన్సీ సుమారు 60 శాతానికి పరిమితమైంది. ఈ శాతాన్ని పెంచాలనే ఉద్దేశంతోనే ఛార్జీలను తగ్గించినట్లు అధికారులు తెలిపారు.తాజా నిర్ణయం ప్రకారం, హైదరాబాద్ మెట్రో డీలక్స్ ఏసీ బస్సుల్లో ప్రతి నాలుగు కిలోమీటర్లకు ఇప్పటివరకు వసూలు చేస్తున్న రూ.30ను రూ.25కు తగ్గించారు. అంటే నాలుగు కిలోమీటర్లకు రూ.5 తగ్గింపు లభించనుంది. అలాగే ఈ-మెట్రో ఏసీ బస్సుల్లో నాలుగు కిలోమీటర్లకు రూ.35గా ఉన్న ఛార్జీని రూ.25కు తగ్గించారు. ఈ విభాగంలో రూ.10 తగ్గింపు ప్రయాణికులకు మరింత ఉపశమనం కలిగించనుంది.Greater Hyderabad Municipal Corporation పరిధిలో ప్రస్తుతం 275 మెట్రో డీలక్స్ ఏసీ బస్సులు, 90 ఎలక్ట్రిక్ ఏసీ బస్సులు నడుస్తున్నాయి. ఈ సర్వీసులన్నింటికీ కొత్త రేట్లు వర్తిస్తాయి. నగరంలోని ఉద్యోగులు, విద్యార్థులు, దినసరి ప్రయాణికులు ఈ నిర్ణయంతో లాభపడనున్నారు. ముఖ్యంగా వేసవిలో తక్కువ ఖర్చుతో సౌకర్యవంతమైన ప్రయాణం చేసే అవకాశం అందుబాటులోకి రానుంది.ఆర్టీసీ వర్గాల విశ్లేషణ ప్రకారం, అధిక ధరలే ఏసీ బస్సుల్లో రద్దీ తగ్గడానికి ప్రధాన కారణమని గుర్తించారు. ఇప్పుడు ఛార్జీల తగ్గింపుతో ప్రయాణికుల సంఖ్య పెరగడమే కాకుండా, సంస్థ ఆదాయం కూడా సమతుల్యంగా ఉండొచ్చని భావిస్తున్నారు. అలాగే పర్యావరణ హిత ఎలక్ట్రిక్ బస్సుల వినియోగాన్ని ప్రోత్సహించడమూ ఈ నిర్ణయానికి మరో ముఖ్య కారణంగా తెలుస్తోంది.పెరుగుతున్న ఉష్ణోగ్రతల మధ్య తీసుకున్న ఈ నిర్ణయం నగర ప్రజలకు ఊరటనివ్వనుంది. తక్కువ ధరతో హాయిగా ప్రయాణించే అవకాశాన్ని ఈ కొత్త టారిఫ్‌లు కల్పించనున్నాయి. మార్చి 1 నుంచి అమల్లోకి రానున్న ఈ మార్పులు ఏసీ బస్సులపై ప్రజల ఆదరణను మరింత పెంచే సూచనలు కనిపిస్తున్నాయి.



## హైదరాబాద్‌లో షాకింగ్ రివీల్.. అల్లం పేస్ట్ తయారీపై సంచలనం



Hyderabad నగరంలో మరో కల్తీ ఆహార తయారీ కేంద్రం బయటపడింది. ఖైరతాబాద్ జోన్ టాస్క్ ఫోర్స్‌కు వచ్చిన విశ్వసనీయ సమాచారంపై లేక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎం.ఎస్. మఖ్తా రైల్వే గేట్ సమీపంలోని ఓ ఇంటిపై ఆకస్మికంగా దాడులు నిర్వహించారు.తనిఖీల్లో అత్యంత అపరిశుభ్రమైన పరిస్థితుల్లో అల్లం—వెల్లుల్లి పేస్ట్ తయారు చేస్తున్నట్లు గుర్తించారు. ఈ పేస్ట్ మానవ ఆరోగ్యానికి హానికరంగా మారే అవకాశముందని అధికారులు తెలిపారు.అబిడ్స్ ప్రాంతానికి చెందిన జసాని ఇల్యాన్ 'JJ ఫుడ్స్' పేరిట ఈ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. గడువు ముగిసిన FSSAI లైసెన్స్‌ను ఉపయోగిస్తూ హోటళ్లు, కిరాణా దుకాణాలకు సరఫరా చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. తయారైన పేస్ట్‌ను మూతలు లేకుండా ప్లాస్టిక్ టబ్బుల్లో నిల్వ చేయడంతో ధూళి, ఈగలు తదితర కాలుష్యాలు చేరి అది వినియోగానికి ప్రమాదకరంగా మారిందని పేర్కొన్నారు.దాడుల్లో సుమారు 4 వేల కేజీల కల్తీ పేస్ట్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీటిలో 40 టబ్బుల్లో 1,600 కేజీలు, 5 కేజీల కంటైనర్లు 130, 1 కేజీ కంటైనర్లు 900, 500 గ్రాముల కంటైనర్లు 300, 200 గ్రాముల కంటైనర్లు 3,000, 50 గ్రాముల ప్యాకెట్లు 2,000 ఉన్నాయి. అదనంగా రెండు గ్రైండింగ్ యంత్రాలు, 5 కేజీల పసుపు పొడి, 20 లీటర్ల ఎసిటిక్ యాసిడ్, 40 బస్తాల ఉప్పు మరియు సరఫరాకు ఉపయోగిస్తున్న గూడ్స్ ఆటోను సీజ్ చేశారు.


## చాలా బాధగా ఉంది

తన పేరుతో ఆన్‌లైన్‌లో సర్క్యులేట్ అవుతున్న AI మార్ఫింగ్ చిత్రాలపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది అగ్ర కథానాయిక కీర్తి సురేష్. డీప్‌ఫేక్ టెక్నాలజీ ద్వారా రూపొందించబడిన ఈ నకిలీ ఫోటోలు తనను మానసికంగా బాధిస్తున్నాయని కీర్తి తెలిపింది. ఈ సందర్భంగా సోషల్ మీడియా వేదికగా పోస్ట్ పెట్టింది.ఇక కీర్తి సురేష్ ఆవేదనకు మద్దతుగా నటి ఆండ్రియా జెరెమియా కూడా AI వల్ల కలిగే నష్టాల గురించి మాట్లాడారు. నటులకే కాదు, సామాన్య ప్రజలకు కూడా AI సమస్యగా మారుతోంది. AI మన కోసం పనిచేయాలి, అంతేకానీ మనల్ని ఇబ్బంది పెట్టకూడదు అని ఆమె అభిప్రాయపడ్డారు.

సూర్య www.suryaa.com EVENING EDITION 4PM

# వెలుగుమట్లలో నేలమట్టమైన ఇండ్లు.. వైరల్‌గా మారిన డ్రోన్ వీడియో

ఖమ్మం నగరంలోని భూదాన్ భూముల్లోని పేదల ఇండ్ల కూల్చివేతల తర్వాత అక్కడి డ్రోన్ విజువల్స్ ఇప్పుడు వెలుగులోకి వచ్చాయి. మంగళవారం నాడు భారీ పోలీసు బందోబస్తు నడుమ బుల్డోజర్లతో నేలమట్టం చేసిన అనంతరం ఇండ్ల దృశ్యాలు ఈ విజువల్స్‌లో స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఒకప్పుడు గుడిసెలు, పక్కా ఇండ్లతో కిటకిటలాడిన ఆ కాలనీ ఇప్పుడు పూర్తిగా మట్టిగుట్టలు, కూలిన గోడలు, శిథిలాలతో కనిపిస్తోంది. ఖమ్మం నగరంలోని భూదాన్ భూముల్లో ఇండ్లు కట్టుకొని ఉంటున్న పేదలపై కాంగ్రెస్ ప్రభుత్వం మంగళవారం మబ్బులనే బుల్డోజర్లతో దండయాత్ర చేసింది. కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులకు ప్రయోజనం చేకూర్చే ఉద్దేశంతో నిరుపేదల ఇండ్లను నేలమట్టం చేసింది. ఖమ్మం అర్బన్ పరిధి వెలుగుమట్ల రెవెన్యూ పరిధిలో ఉన్న భూదాన్ భూముల్లో 12 ఏండ్లుగా ఖమ్మంతోపాటు చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన నిరుపేదలు గుడిసెలు, కొంతమంది పక్కా ఇండ్లు కట్టుకొని నివాసముంటున్నారు. గడిచిన పదేండ్లలో వెలుగుమట్ల ప్రాంతం ఓ పెద్దకాలనీగా మారింది. కాలనీ ప్రజలంతా ఒక్కటై తమకు పట్టాలు మంజూరు చేయాలని గత ప్రభుత్వానికి పలుమార్లు విన్నవించారు. కేసీఆర్ ప్రభుత్వం పట్టాలు ఇచ్చేందుకు ప్రయత్నించినా భూదాన్ భూముల వివాదం కోర్టులో ఉండటంతో నాడు ఇవ్వడం సాధ్యం కాలేదు. ఈ క్రమంలో స్థానికంగా భూములు కలిగిన కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఈ భూముల్లో ఉంటున్న పేదలను అక్కడ లేకుండా చేయాలనే ప్రయత్నాలు సాగిస్తూ వచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం.. వారికి అనుకూల అమాత్యుడూ అదే పార్టీలో ఉండటంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కలిసొచ్చిన అంశంగా మారింది. నిరుడు కూడా అమాత్యుడి సాయంతో ఓ దఫా రెవెన్యూ, పోలీసులను ప్రయోగించి కాలనీలోని పలు ఇండ్లను కూల్చివేయించారు. అక్కడ నివసించే బడుగుబలహీన వర్గాలవారి ఇండ్లను పూర్తిగా నేలమట్టం చేస్తేనే తమ భూముల ధరలు పెరుగుతాయనే కుటిలబుద్ధితో కొందరి పేర్లతో కోర్టుల్లో కేసులు సైతం వేయించారు. అక్కడ ఇండ్లు కట్టుకున్న పేదలకు ఖాళీ చేయాలని నోటీసులు జారీ చేయించారు.






అయినా ఖాళీ చేయకపోవడంతో ప్రభుత్వ పెద్దలపై ఒత్తిడి తెచ్చి వేలాది మంది పోలీసుల బందోబస్తు నడుమ పేదల ఇండ్లను మంగళవారం నేలమట్టం చేయించారు.



## సీఎం మార్పుపై డీకేఎస్ ఒత్తిడి?

కర్ణాటక కాంగ్రెస్‌లో నాయకత్వ మార్పు అంశం మరోసారి తీవ్ర చర్చనీయాంశమైంది. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ వర్గానికి చెందిన దాదాపు 30 మంది ఎమ్మెల్యేలు బెంగళూరులోని ఓ ప్రైవేట్ హోటల్‌లో రహస్యంగా సమావేశం కావడం రాజకీయంగా ప్రకంపనలు సృష్టిస్తోంది. ఓ ఎమ్మెల్యే పుట్టినరోజు వేడుక అని పైకి చెబుతున్నప్పటికీ అధికార మార్పిడిపైనే ప్రధానంగా చర్చ జరిగినట్లు సమాచారం. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య రెండున్నరేళ్ల తర్వాత పదవిని తనకు అప్పగిస్తారనే ఒప్పందం ఉందని డీకే శివకుమార్ వర్గం బలంగా వాదిస్తోంది. ఈ నేపథ్యంలోనే ఆయన తన బలాన్ని నిరూపించుకునేందుకు ఈ సమావేశం నిర్వహించినట్లు తెలుస్తోంది. అయితే, ఐదేళ్లూ సిద్ధరామయ్యే సీఎంగా కొనసాగుతారని ఆయన వర్గం స్పష్టం చేస్తోంది. ఈ సమావేశంలో ఇద్దరు మంత్రులు కూడా పాల్గొనడం గమనార్హం. డీకే శివకుమార్ వర్గం ఇక్కడ సమావేశమైన సమయంలోనే ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు మద్దతుగా ఉన్న 20 మందికి పైగా ఎమ్మెల్యేలు విదేశీ పర్యటనలో ఉన్నారు. వారు మార్చి 1న తిరిగి రానున్నారు. మరోవైపు, ఈ పరిణామాలపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పందిస్తూ నాయకత్వ మార్పుపై అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందని, ప్రస్తుతానికి ఎలాంటి గందరగోళం లేదని తెలిపారు. ఇదిలా ఉండగా, సిద్ధరామయ్య మద్దతుదారులు కొత్త వాదనను తెరపైకి తెచ్చారు. ఒకవేళ ముఖ్యమంత్రిని మార్చాల్సి వస్తే, దళిత నేతకు (మల్లికార్జున ఖర్గే లేదా జి. పరమేశ్వర) అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. బడ్జెట్ సమావేశాల తర్వాత మార్చిలో రాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామాలు జరగవచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.



## తెలంగాణలో రెండో సీటుపై కాంగ్రెస్ ఉత్కంఠ

పది రాష్ట్రాల్లోని 37 రాజ్యసభ స్థానాలకు మార్చి 16న ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో నామినేషన్ల ప్రక్రియ మొదలైంది. ఈ ఎన్నికల్లో బీజేపీ అధిక స్థానాలు గెలుచుకోవడం ఖాయంగా కనిపిస్తుండగా, కాంగ్రెస్ పార్టీకి కేవలం ఐదు సీట్లు దక్కే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో, పరిమిత సంఖ్యలో ఉన్న స్థానాలకు అభ్యర్థుల ఎంపికపై కాంగ్రెస్ తీవ్రంగా కసరత్తు చేస్తోంది. ఈసారి సామాజిక సమీకరణాల కంటే, ప్రభుత్వానికి గట్టిగా గళం వినిపించే 'ఫైర్‌పవర్' ఉన్న నేతలకే పెద్దపీట వేయాలని పార్టీ అధిష్ఠానం భావిస్తున్నట్టు తెలుస్తోంది. తెలంగాణలో కాంగ్రెస్‌కు రెండు సీట్లు దక్కే అవకాశం ఉండటంతో ఇక్కడ పోటీ ఆసక్తికరంగా మారింది. ఒక రాజ్యసభ స్థానం గెలవాలంటే 40 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం. కాంగ్రెస్‌కు 66 మంది సొంత ఎమ్మెల్యేలతో పాటు, ఒక లెఫ్ట్, ఏడుగురు ఎంఐఎం ఎమ్మెల్యేల మద్దతుతో బలం 74కు చేరింది. దీంతో ఒక సీటు సులభంగా గెలుచుకోనుంది. అయితే, రెండో సీటు కోసం బీఆర్ఎస్‌తో గట్టి పోటీ తప్పకపోవచ్చు. బీఆర్ఎస్‌కు 36 మంది ఎమ్మెల్యేలు ఉండగా, బీజేపీకి 8 మంది ఉన్నారు. ఇక్కడి నుంచి సీనియర్ నేత అభిషేక్ మను సింఘ్వీ, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డి పేర్లు పరిశీలనలో ఉన్నాయి.

## 2026లో బంగారం కొత్త రికార్డు సృష్టిస్తుందా?

భారతీయుల జీవితంలో బంగారానికి ప్రత్యేక స్థానం ఉంది. పండగలు, వివాహాలు, శుభకార్యాలు అంటే బంగారం కొనడం అనేది సాంప్రదాయంగా మారింది. అయితే ఇటీవలి కాలంలో బంగారం ధరలు వరుసగా పెరుగుతూ సామాన్యులకు భారంగా మారుతున్నాయి.2026లో ధరలు తగ్గుతాయనే ఆశతో చాలామంది ఎదురు చూస్తుండగా, తాజా అంచనాలు మాత్రం షాక్‌కు గురిచేస్తున్నాయి. ప్రపంచ ప్రఖ్యాత ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ JPMorgan Chase బంగారం భవిష్యత్ ధరలపై విడుదల చేసిన నివేదికలో, ప్రస్తుతం కనిపిస్తున్న పెరుగుదల కేవలం ప్రారంభమేనని పేర్కొంది. అసలు గోల్డ్ ర్యాలీ ఇంకా ముందుందని విశ్లేషించింది.





★2026 నాటికి భారీ జంప్? : ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో ఒక ఔన్స్ బంగారం ధర సుమారు 5,200 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతోంది. అయితే భౌగోళిక-రాజకీయ ఉద్రిక్తతలు, గ్లోబల్ ఆర్థిక అనిశ్చితి కొనసాగితే ఇది 6,300 డాలర్ల స్థాయిని తాకే అవకాశముందని అంచనా. అంతర్జాతీయ ధరలు పెరిగితే భారత మార్కెట్‌పై దాని ప్రభావం మరింతగా ఉంటుంది.ఇప్పటికే దేశంలో ఒక సావరిన్ (8 గ్రాములు) బంగారం ధర రూ.1,19,360 వద్ద ఉంది. విశ్లేషకుల అంచనాల ప్రకారం, రాబోయే రోజుల్లో 10 గ్రాముల బంగారం ధర రూ.2 లక్షలకు చేరే అవకాశం ఉందని చెబుతున్నారు. అంటే ఒక గ్రాము బంగారం కొనడానికే వేల రూపాయలు వెచ్చించాల్సి వచ్చే పరిస్థితి ఏర్పడవచ్చు.

★ధరల పెరుగుదలకు కారణాలేంటి? : అమెరికాలో వడ్డీ రేట్ల తగ్గింపుపై సంకేతాలు రావడం వల్ల పెట్టుబడిదారులు బంగారం వైపు మళ్లుతున్నారు. యుద్ధాలు, ఆర్థిక మందగమనం వంటి పరిస్థితుల్లో బంగారాన్ని సురక్షిత పెట్టుబడిగా భావించడం కూడా డిమాండ్ పెరగడానికి కారణం.దీర్ఘకాలిక పెట్టుబడిదారులకు ఇది లాభదాయకమై ఉండొచ్చు. కానీ ఆభరణాల కోసం కొనుగోలు చేసే వారికి మాత్రం ఇది అదనపు భారం. ధరలు తగ్గుతాయనే ఆశతో ఎక్కువకాలం వేచి ఉంటే, మరింత అధిక ధర చెల్లించాల్సి రావచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కాబట్టి కొనుగోలు నిర్ణయాన్ని ముందుగానే ప్రణాళిక చేసుకోవడం మంచిదని సూచిస్తున్నారు.

## ప్రాజెక్టులపై కేటీఆర్ హరీశ్ వ్యాఖ్యలు వాస్తవ దూరమన్న పొంగులేటి

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టుల పేరుతో అవకతవకలు జరిగాయంటూ రాష్ట్ర సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ధ్వజమెత్తారు. లక్ష కోట్లు ఖర్చు చేసినా ఫలితం శూన్యమని విమర్శించారు. ప్రాజెక్టులపై మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు చేస్తున్న వ్యాఖ్యలు వాస్తవ దూరమని, ప్రజలను తప్పుదోవ పట్టించడమే వారి లక్ష్యమని ఆయన ఆక్షేపించారు. కాళేశ్వరం ప్రాజెక్టును రూ. 1.08 లక్షల కోట్ల అంచనాతో నిర్మించి, కేవలం 110 టీఎంసీల నీటిని మాత్రమే అందుబాటులోకి తీసుకురావడం గత పాలకుల అసమర్థతకు నిదర్శనమని పొంగులేటి మండిపడ్డారు. ఎన్నికలకు ముందే బ్యారేజీలు కుంగిపోయాయని అన్నారు. ఆ తప్పిదాల నుంచి తప్పుకోవడానికే ఇప్పుడు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. అలాగే బీఆర్ఎస్, బీజేపీల మధ్య 'ఫెవికాల్ బంధం' ఉందన్న విషయం బహిరంగ రహస్యమేనని, అందుకే వారు ఒకరికొకరు సహకరించుకుంటున్నారని ఎద్దేవా చేశారు.రాష్ట్ర నీటి ప్రయోజనాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని మంత్రి స్పష్టం చేశారు. బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా రాష్ట్ర ప్రయోజనాల కోసం సలహాలు ఇవ్వాల్సింది పోయి, కేవలం రాజకీయ లబ్ధి కోసం విమర్శలు చేయడం దురదృష్టకరమని పొంగులేటి అన్నారు. తెలంగాణ హక్కుల కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పోరాడుతుందని, గత ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్ది రైతులకు మేలు చేకూర్చడమే తమ ప్రథమ ప్రాధాన్యత అని ఆయన వెల్లడించారు.

## దూకుడుగా వస్తే అణచివేస్తాం.. ఆఫ్ఘన్‌కు పాక్ ప్రధాని హెచ్చరిక



దూకుడుగా వ్యవహరించాలని చూసే ఎలాంటి దురాక్రమణనైనా అణచివేసే పూర్తి సామర్థ్యం తమ సాయుధ బలగాలకు ఉందని పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ అన్నారు. ఆఫ్ఘనిస్థాన్‌లోని ప్రధాన నగరాలపై పాక్ దళాలు దాడులు జరిపిన కొన్ని గంటల తర్వాత ఆయన ఇవాళ ఈ తీవ్రమైన హెచ్చరికలు జారీ చేశారు. నిన్న రాత్రి ఆఫ్ఘన్ దళాలు పాక్ సరిహద్దు సైనికులపై దాడి చేయడంతో, దానికి ప్రతీకారంగా ఆఫ్ఘనిస్థాన్‌లోని కాబూల్, కాందహార్ నగరాలే లక్ష్యంగా పాకిస్థాన్ వైమానిక దాడులు నిర్వహించింది. ఈ దాడుల అనంతరం పాక్ ప్రభుత్వ అధికారిక 'ఎక్స్' (ట్విట్టర్) ఖాతా ద్వారా షరీఫ్ తన సందేశాన్ని విడుదల చేశారు. ఇటీవలి కాలంలో పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్ మధ్య సరిహద్దుల్లో ఉద్రిక్తతలు తీవ్రమయ్యాయి. తాజా ఘర్షణల్లో ఇరు దేశాలకు చెందిన పదుల సంఖ్యలో సైనికులు మరణించినట్లు ఇరు పక్షాలు ప్రకటించాయి. ఈ నేపథ్యంలో పాకిస్థాన్ సాయుధ బలగాలకు దేశ ప్రజలందరి మద్దతు ఉందని, యావత్ జాతి సైన్యానికి అండగా నిలుస్తుందని షెహబాజ్ షరీఫ్ పేర్కొన్నారు.



## విక్టరీ వెంకటేష్ X నందమూరి కల్యాణ్ రామ్ =అనిల్ రావిపూడి

వరుస విజయాలతో దూసుకుపోతున్న ప్రముఖ దర్శకుడు అనిల్ రావిపూడి తన తదుపరి చిత్రాన్ని అధికారికంగా ప్రకటించారు. విక్టరీ వెంకటేష్, నందమూరి కల్యాణ్ రామ్ హీరోలుగా ఓ క్రేజీ మల్టీస్టారర్ రాబోతోందని వెల్లడించారు. 2027 సంక్రాంతి పండుగ కానుకగా ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు గురువారం సోషల్ మీడియా ద్వారా తెలిపారు. చిరంజీవితో 'మన శంకరవరప్రసాద్ గారు' మూవీ తర్వాత కొంతకాలంగా అనిల్ రావిపూడి తదుపరి చిత్రంలో వెంకటేష్‌తో పాటు మరో హీరో ఎవరనే దానిపై రకరకాల ఊహాగానాలు వినిపించాయి. వాటన్నింటికీ తెరదించుతూ కల్యాణ్ రామ్ పేరును ఖరారు చేయడంతో ఈ ప్రాజెక్ట్‌పై అంచనాలు పెరిగాయి. ఈ సందర్భంగా అనిల్ రావిపూడి ఓ ఆసక్తికరమైన ట్వీట్ చేశారు. "నాకు మొదటిసారి 'బొమ్మ' తీసే అవకాశం ఇచ్చిన హీరో కల్యాణ్ రామ్‌తో, నా మొదటి 'వందకోట్ల బొమ్మ' కొట్టిన హీరో వెంకటేష్ గారితో కలిసి 2027 మొదటి పండక్కి మీ ముందుకు వస్తున్నాం" అని పేర్కొన్నారు.

## మొబైల్‌లో సిమ్ లేకపోతే.. వాట్సాప్ పనిచేయదు.. ఎల్లుండి నుంచి కొత్త రూల్ అమలు

మెసేజింగ్ యాప్ వాట్సాప్‌పై కేంద్రం కీలక ప్రకటన చేసింది. ఈ నెల 28వ తేదీ తర్వాత సిమ్ లేకుండా వాట్సాప్ పనిచేయదు. వాట్సాప్ వాడాలంటే సిమ్ తప్పనిసరిగా ఉండాలంటూ జారీచేసిన 'సిమ్ అనివార్యం' నిబంధనకు ఫిబ్రవరి 28 డెడ్‌లైన్‌గా కేంద్రం గతంలో ప్రకటించింది. ఈ డెడ్‌లైన్‌ను పొడిగించబోమని కేంద్రం స్పష్టంచేసింది. జాతీయ భద్రతకు, సైబర్ నేరగాళ్ల నుంచి యూజర్లను కాపాడేందుకే వీటిని అమలులోకి తెస్తున్నట్టు కేంద్ర కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా తెలిపారు. కొత్త నిబంధనల ప్రకారం వాట్సాప్, టెలిగ్రామ్, సిగ్నల్, స్నాప్‌చాట్, షేర్‌చాట్, జియోచాట్, అరాటై, జోష్ లాంటి సామాజిక మాధ్యమాల వినియోగానికి మొబైల్ ఫోన్‌లో తప్పనిసరిగా సిమ్ ఉండాల్సిందే. అలాగే కంప్యూటర్‌లో లాగిన్ చేసిన వాట్సాప్ కూడా ఆరు గంటల తర్వాత ఆటోమేటిక్‌గా లాగౌట్ అయిపోతుంది. సైబర్ నేరగాళ్లను పట్టుకోవడానికి ఈ విధానం ఉపయోగపడుతుందని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. మార్చి 1వ తేదీ నుంచి వాట్సాప్ నిబంధనలు కూడా




మారిపోతున్నాయి. గతంలో మొబైల్ నుంచి సిమ్ తొలగించినా వాట్సాప్ యాప్ యథావిధిగా పనిచేసేది. అయితే మార్చి 1 నుంచి రిజిస్టరైన సిమ్ తప్పనిసరిగా మొబైల్‌లో ఉండాలి. పైగా అది క్రియాశీలకంగా (అంటే రీచార్జి చేసి) ఉండాలి. అలాగే గతంలో పర్సనల్ కంప్యూటర్లలో వాట్సాప్‌ను లాగిన్ చేస్తే అది ఎన్ని రోజులైనా క్రియాశీలకంగా ఉండేది. కొత్త నిబంధన ప్రకారం ఆరు గంటల తర్వాత అది ఆటోమేటిక్‌గా లాగౌట్ అయిపోతుంది. గతంలో ఎక్కడి నుంచైనా ఓటీపీని ఉపయోగించి వాట్సాప్‌కు లాగిన్ అయ్యే వారు. ఇప్పుడు సిమ్ లేకపోతే వాట్సాప్ పనిచేయదు.




## కూలిన పాక్ 'వైట్ ఎలిఫెంట్'..

### ఎఫ్-16 శకలాలను ప్రదర్శించిన తాలిబన్లు!

ఆఫ్ఘనిస్థాన్, పాకిస్థాన్ మధ్య సరిహద్దు ఉద్రిక్తతలు తీవ్రస్థాయికి చేరాయి. తమ భూభాగంలోకి ప్రవేశించి దాడులు చేసిన పాకిస్థాన్‌కు చెందిన ఎఫ్-16 యుద్ధ విమానాన్ని కూల్చివేసినట్లు తాలిబన్ ప్రభుత్వం ప్రకటించింది. ఇందుకు ఆధారంగా విమాన శకలాలకు సంబంధించిన వీడియోను విడుదల చేయడం సంచలనం రేపుతోంది. శుక్రవారం తెల్లవారుజామున కాబూల్, కాందహార్ సహా పలు ఆఫ్ఘన్ నగరాలపై పాక్ వైమానిక దళం బాంబు దాడులు చేసింది. ఈ దాడులను తిప్పికొట్టే క్రమంలో పాక్‌కు చెందిన ఒక యుద్ధ విమానాన్ని కూల్చివేశామని తాలిబన్ అధికార ప్రతినిధి జబిహుల్లా ముజాహిద్ తెలిపారు. ఈ విమానం కాబూల్ సమీపంలోని పర్వత ప్రాంతంలో కుప్పకూలిందని, పైలట్ కోసం గాలిస్తున్నామని ఆయన వివరించారు. తాలిబన్లు విడుదల చేసిన వీడియోలో యుద్ధ విమానం తోక భాగం, దానిపై పాకిస్థాన్ జెండా, సీరియల్ నంబర్లు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అయితే, ఈ ఆరోపణలను పాకిస్థాన్ రక్షణ శాఖ ఖండించింది. తమ విమానాలన్నీ సురక్షితంగా వెనక్కి వచ్చాయని, ఏ విమానమూ కూలిపోలేదని స్పష్టం చేసింది. కానీ, తాలిబన్లు ప్రదర్శిస్తున్న వీడియోపై మాత్రం పాక్ ప్రభుత్వం ఎలాంటి వివరణ ఇవ్వలేదు.